



WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

# విజయ కెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 17 సోమవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 193 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

MONDAY AUGUST 17 2026 | VOL:18 | ISSUE: 193 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## మేడారంలో సీఎం పర్యటన..

**సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న సీఎం రేవంత్**

**మేడారం, ఆగస్టు 16**

ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క–సారలమ్మ గద్దెలను సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణకుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు. అంతకుముందు



## బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని–సూర్యతేజ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. వేడుకలో బండ్ల గణేశ్ కుటుంబసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి సందడి చేశారు. వారంతా నూతన దంపతులను అభినందించి, ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వివాహ ప్రాంగణం కోలాహలంగా మారింది. బండ్ల గణేశ్ ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తూ కనిపించారు.



# సి ఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు డాక్టర్ ఎం సి ఆర్ టిమ్స్ ప్రారంభం

**ప్రభుత్వ ఆస్పత్రి.. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు**

**కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా టిమ్స్ సనత్‌నగర్**

**1,082 పడకలు.. అందులో 300 ఐసీయూ బెడ్స్**

**31 మేజర్ ఆపరేషన్ థియేటర్లు**

**1--2 నిమిషాల్లో పరీక్షల నమూనాల తరలింపు**

**75 శాతం నీటి పొదుపుతో గ్రీన్ ఆస్పత్రి**




**హైదరాబాద్, ఆగస్టు 16**

సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సనత్‌నగర్ లో నిర్మించిన ప్రతిష్ఠాత్మక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డిఆర్ ఎం సీ ఆర్ టిమ్స్) ను ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా టిమ్స్ సనత్‌నగర్ రూపుదిద్దుకుంది. ప్రభుత్వ రంగంలో ఒకే దశలో నిర్మించిన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఇది ప్రత్యేకతను సంతరించుకుంది. 22.6 ఎకరాల విస్తీర్ణంలో, 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో ఈ సమగ్ర వైద్య సముదాయాన్ని అభివృద్ధి చేశారు. క్లాసిక్ ఆర్కిటెక్చర్‌తో నాలుగు బ్లాకులుగా నిర్మించిన టిమ్స్ 75 శాతం నీటి పొదుపుతో ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ సాధించింది. ఆరు కీలక విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా దీన్ని తీర్చి దిద్దారు. ఈ ఆసుపత్రిలో రోగులకు

(మిగతా 2వ పేజీలో..)

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి: ఉత్తమ్

**స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు**

**సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం**

**పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు**

రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ

(మిగతా 2వ పేజీలో..)



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ కుట్ర.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు సిద్ధంకండి..!

పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక భరోసా కల్పిస్తూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రద్దుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోలనను చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు తెలియజేశారు.

కల్యాణ లక్ష్మి అంశంలో హైకోర్టులో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందని



(మిగతా 2వ పేజీలో..)

## ట్రంప్‌ను 'ఫుడ్ ట్రక్'తో పోల్చిన ఇరాన్.. హర్మ్యాజ్ జలసంధిపై మాటల యుద్ధం

**హర్మ్యాజ్ జలసంధిపై ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ గట్టి కౌంటర్**

**ముందు సొంత భద్రత చూసుకోవాలంటూ ట్రంప్‌కు ఘాటు సూచన**

**ఈ వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య మరింత పెరిగిన దౌత్యపరమైన వేడి**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యాజ్ జలసంధిని మూసివేస్తామన్న తమ హెచ్చరికలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఇరాన్ తీవ్రస్థాయిలో బదులిచ్చింది. ట్రంప్‌ను ఒక 'ఫుడ్ ట్రక్'తో పోలుస్తూ ఎద్దేవా

(మిగతా 3వ పేజీలో..)



## సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలి : మంత్రి జూపల్లి




**హైదరాబాద్, ఆగస్టు 16**

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని, వివిధ భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, కళారూపాలే దేశ ప్రత్యేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన 'సాంస్కృతిక సంబరాలు--2026 (హైదరాబాద్ జిందాబాద్)' కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడారు. తెలంగాణకు గొప్ప చరిత్ర,

(మిగతా 2వ పేజీలో..)

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను: కల్వకుంట్ల కవిత

**షోకాజు నోటీసు లేకుండానే పార్టీ నుంచి పంపించారని ఆవేదన**

**రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా**

**బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతామని ప్రకటన**

**కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం**

(మిగతా 3వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

## మేడారంలో సీఎం పర్యటన..

మేడారం చేరుకున్న ముఖ్యమంత్రికి హెలిప్యాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి: ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ కుట్ర.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు సిద్ధంకండి..!

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల అవినీతి అంశాల్లో కోట్లాది రూపాయలు చెల్లించి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే ప్రభుత్వం.. పేదలు లబ్ది పొందే ఈ పథకం విషయంలో ఎందుకు కౌంటర్ వెయ్యలేదు? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాల తరపున బీఆర్ఎస్ కాంగ్రెస్ నిలదీస్తుంది అని ఈ సందర్భంగా వెల్లడించారు. ఆడబిడ్డలు తులం బంగారం అడుగుతున్నందుకే పూర్తిగా కల్యాణ లక్ష్మిని ఎత్తగొట్టే కుట్రకు రేవంత్ సర్కార్ తెరతీసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తీరును ఖండిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పిలుపునిచ్చారు కేటీఆర్.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని కేటీఆర్ గుర్తు చేశారు. రూ. 51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని ఆయన తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందని కేటీఆర్ వెల్లడించారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు.కల్యాణ లక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ.. ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో, ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని ఆయన అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కల్యాణ లక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందని కేటీఆర్ నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అవినీతి.. హైడ్రా వంటి అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీ మొత్తాలు చెల్లించి వాదించే ప్రభుత్వం.. ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకాన్ని కాపాడుకునే విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కేటీఆర్ ప్రశ్నించారు.



# సి ఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు డాక్టర్ ఎం సి ఆర్ టిమ్స్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర వైద్య సేవలు అందనున్నాయి. ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో నిర్మితమైన టిమ్స్ లో ఏర్పాటు చేయటం విశేషం. ఈ వ్యవస్థ ద్వారా రోగుల నుంచి పరీక్షలు చేసేందుకు సేకరించిన నమూనాలు ఒకటి నుంచి రెండు నిమిషాల్లోనే సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరతాయి.

**ఒకే మాస్టర్‌ప్లాన్‌తో.. పూర్తి స్థాయి వైద్య సముదాయం**

సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి దశలవారీగా సంవత్సరాలపాటు కొనసాగుతుంటుంది. అందుకు భిన్నంగా టిమ్స్ సనత్‌నగర్‌ను ఒకే దశలో, ఒకే మాస్టర్‌ప్లాన్ కింద సంపూర్ణ సూపర్ స్పెషాలిటీ వైద్య సముదాయంగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. ఆస్పత్రిలో మొత్తం 1,082 పడకలు, అందులో 300 ఐసీయూ పడకలు ఉన్నాయి. మొత్తం పడకల్లో దాదాపు 30 శాతం ఐసీయూలకు కేటాయించడం ద్వారా అత్యవసర, క్లిష్ట వైద్య సేవలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం ఈపీసీ విధానంలో నిర్మించే బాధ్యతను లిమేఫా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)లికు అప్పగించింది. సివిల్ నిర్మాణాలు, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ (ఎంఈపీ) వ్యవస్థలతోపాటు ఆధునిక వైద్య పరికరాలు, సాంకేతిక సదుపాయాలను ఎంఈఐఎల్ సమకూర్చింది.

**నాలుగు బ్లాకులు.. సమగ్ర వైద్య సేవలు**

ఆస్పత్రిని నాలుగు ప్రధాన బ్లాకులుగా ప్రభుత్వం నిర్మించింది. మొత్తం 31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు ఇందులో ఉన్నాయి. దయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ ల్యాబ్‌లు, 12 మైక్రోబయాలజీ ల్యాబ్‌లు, 10 బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు, 5 ప్రత్యేక ల్యాబ్‌లు ఉన్నాయి. బ్లాక్–ఏలో అత్యవసర సేవలు, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ బెడ్లు, సెంట్రల్ స్టెరైల్ సర్వీస్ విభాగం ఉన్నాయి. బ్లాక్–బీలో ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, లీనాక్ ఆధారిత న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, రెండు క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. బ్లాక్–సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లు, సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఉన్నాయి. బ్లాక్–డీలో పరిపాలన, విద్యా విభాగాలతోపాటు 200 మంది కూర్చునే ఆడిటోరియం ఉంది.

**నిమిషాల్లోనే రక్త నమూనాలు.. ఏఐ ఆధారిత పైప్ వ్యవస్థ**

టిమ్స్ సనత్‌నగర్‌లో అత్యంత ప్రత్యేకమైన సాంకేతిక సదుపాయాల్లో ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థ ఒకటి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దేశంలోనే తొలిసారిగా ఈ తరహా వ్యవస్థను టిమ్స్ సనత్ నగర్ లో ఏర్పాటు చేశారు. సీల్డ్ ట్యూబ్‌లు, గాలి ఒత్తిడితో రక్త నమూనాలు, మందులు, వైద్య నివేదికలు, అత్యవసర వినియోగ వస్తువులను వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్‌లు, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్‌ల మధ్య కేవలం 1--2 నిమిషాల్లో ఈ విధానం ద్వారా తరలించవచ్చు. దీంతో పరీక్షల ఫలితాల కోసం పట్టే సమయం తగ్గడంతోపాటు కలుషితమయ్యే ప్రమాదం కూడా తగ్గుతుంది.

**ఆరు కీలక విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

అవయవ మార్పిడి, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, ట్రామా కేర్ వంటి ఆరు ప్రధాన రంగాల్లో టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దింది. కిడ్నీ, కాలేయం, గుండె, బహుళ అవయవ మార్పిడి సేవలకు ఇక్కడ అవకాశం ఉంది. ఆధునిక కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు, లీనాక్ ఆధారిత రేడియోథెరపీ, 24 గంటల అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ బ్యాకప్‌తో 30 క్లినికల్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి.

**అత్యాధునిక స్కానింగ్ సదుపాయాలు**

ఆస్పత్రిలో 3.0 టెస్లా ఎంఆర్‌ఐ, 128–స్లైస్ సీటీ స్కానర్, అధునాతన మామోగ్రఫీ యూనిట్, 5 ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేశారు. రోగులతో వచ్చే సహాయకుల కోసం జీం5 అంతస్తుల్లో నిర్మించిన ధర్మశాలలో 200 మందికి వసతి కల్పించేలా సదుపాయాలు ఉన్నాయి. 30 మృతదేహాల సామర్థ్యంతో మార్చురీతో పాటు, కేంద్ర వంటశాల, లాండ్రీ,, వైద్య వాయు (మెడికల్ ఆక్సిజన్) పైప్‌లైన్ వ్యవస్థలకు ప్రత్యేక బ్లాకులు ఇందులో నిర్మించారు.

**75 శాతం నీటి పొదుపు.. ఐజీబీసీ గోల్డ్ రేటింగ్**

టిమ్స్ సనత్‌నగర్ నిర్మాణంలో పర్యావరణహిత సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ విధానం ద్వారా 75 శాతం నీరు ఆదా ఐంది . తగిన సామర్థ్యంతో ఎస్టీపీ, ఈటీపీలు ఏర్పాటు చేసి మురుగునీరు, వ్యర్థ ద్రవాలను ఈ ఆసుపత్రిలో శుద్ధి చేయనున్నారు. వర్షపు నీటిని సేకరించి యార్డ్ వాటర్ సంప్‌ల ద్వారా మొక్కలు, గ్రీన్ కారిడార్లకు వినియోగించే విధానం టిమ్స్ సనత్ నగర్ లో అమలుకానుంది. పర్యావరణహిత నిర్మాణం, ఇంధన సామర్థ్య వ్యవస్థల కారణంగా ప్రాజెక్టుకు ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ లభించింది.

**35 లక్షల సురక్షిత పని గంటలు**

నిర్మాణ సమయంలో 35 లక్షల సురక్షిత పని గంటలు నమోదు చేసినట్లు ఎంఈఐఎల్ గ్రూప్ తెలిపింది. ప్రమాదాలు చోటుచేసుకోకుండా నిర్మాణాన్ని పూర్తి చేయడం ద్వారా వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సంస్థ పేర్కొంది.

**ప్రభుత్వ వైద్యరంగంలో కొత్త ప్రమాణం**

హైదరాబాద్ నడిబొడ్డున క్లాసిక్ ఆర్కిటెక్చర్‌తో కాంక్రీట్ నిర్మాణంగా రూపుదిద్దుకున్న టిమ్స్ సనత్‌నగర్ ప్రభుత్వ వైద్యరంగంలో భారీ స్థాయి మౌలిక వసతులు, అత్యాధునిక సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, భద్రతను సమన్వయం చేసిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా నిలిచింది. సామాన్య ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభించే స్థాయి అధునాతన వైద్య సేవలను ప్రభుత్వ వ్యవస్థలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యానికి ఈ ఆస్పత్రి ప్రతీకగా నిలవనుంది. ప్రభుత్వ ఆస్పత్రులు కూడా ప్రైవేటు కార్పొరేట్ వైద్య సంస్థలకు దీటైన స్థాయిలో ఆధునిక, సూపర్ స్పెషాలిటీ సేవలు అందించగలవని ఈ ప్రాజెక్టు చాటిచెబుతోందని వైద్య రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలి : మంత్రి జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

ఘనమైన వారసత్వం, సుసంపన్నమైన సంస్కృతి ఉందని మంత్రి అన్నారు. బతుకమ్మ, బోనాలు, సమ్మక్క--సారలమ్మ జాతర వంటి పండుగలు తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. పెరిణి శివతాండవం, ఒగ్గుడోలు, గుస్సాడి, చిందు యక్షగానం వంటి జానపద కళారూపాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని పేర్కొన్నారు. కళారూపాలను గత వైభవంగా మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కళాకారులకు ప్రోత్సాహం అందించడంతో పాటు యువతలో సాంస్కృతిక ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. హైదరాబాద్‌కు ప్రత్యేకమైన సమ్మిళిత సంస్కృతి ఉందని, వివిధ భాషలు, మతాలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు తరతరాలుగా కలిసి జీవిస్తున్న నగరమని అన్నారు. చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు నగర చారిత్రక వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. హైదరాబాద్ కళలు, సాహిత్యం, సంగీతం, వంటకాలు, పండుగలు, వారసత్వ సంపద నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని చెప్పారు.

సామాజిక రుగ్మతలపై చైతన్యం అవసరం

సమాజంలో పెరుగుతున్న రుగ్మతలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. కార్పొరేట్ విద్య, వైద్యం ప్రభావం, సామాజిక అనుకరణ పేరుతో పెరుగుతున్న హంగులు, ఆర్భాటాలు, యువతలో వ్యసనాలు, డ్రగ్స్ వినియోగం, నేరాలు వంటి అంశాలపై సామాజిక చైతన్యం అవసరమని పేర్కొన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజంలో చైతన్యం, బాధ్యత, విలువలను పెంపొందించేలా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు కళలు, సాహిత్యం, మీడియా, సాంస్కృతిక సంస్థలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు కళాకారులకు వేదిక కల్పించడంతో పాటు మన సంస్కృతిని ప్రజలకు మరింత చేరువ చేస్తాయని మంత్రి అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరంను అభినందించారు. పాల్గొన్న కళాకారులు, సాంస్కృతిక సంస్థలు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి, జాతీయ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, టీజీఎస్ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ జి.ఆర్. కిరణ్‌రెడ్డి, సోషల్ ఇంజనీర్ చించలి రాజీవ్‌కుమార్, పర్యావరణవేత్త డా. జయసూర్య, కళాకారులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# పారిశ్రామిక రసాయనాలను అక్రమంగా దారి మళ్లించి విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్న చిట్యాల పోలీసులు -- ఐదుగురు నిందితుల అరెస్ట్

**నల్లగొండ ఆగస్టు 16 విజయ కెరటం ప్రతినిధి**

చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలిమినేడు గ్రామ శివారులో గల రాజస్థాన్ ధాబా వెనుక భాగంలో పారిశ్రామిక రసాయనాలనుఎ (సాల్వెంట్లు, ఐసో ప్రొపైల్ ఆల్కహాల్, మిథనాల్ తదితర కెమికల్స్) అక్రమంగా ట్యాంకర్ల నుండి తీసి డ్రమ్ములలో నిల్వచేసి విక్రయిస్తున్న ముఠాను చిట్యాల పోలీసులు విశ్వసనీయ సమాచారంతో పట్టుకున్నారు.తేదీ 15.08.2026 న వెలిమినేడు గ్రామ శివారులోని రాజస్థాన్ ధాబా వెనుక పార్కింగ్ స్థలంలో అనుమానాస్పదంగా నిలిపిన వాహనాలను తనిఖీ చేయగా, ట్యాంకర్ లారీలలో రవాణా చేయబడుతున్న పారిశ్రామిక రసాయనాలను గమ్యస్థానానికి పూర్తిగా చేర్చకుండా కొంత భాగాన్ని అక్రమంగా బయటకు తీసి ఇతరులకు విక్రయిస్తూ అక్రమ లాభార్జనకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

నేరం జరిగిన విధానం

ప్రధాన నిందితుడు చాపల సత్యనారాయణ ఏ సతీష్ తన సహచరులతో కలిసి జాతీయ రహదారి-65 పై ప్రయాణించే రసాయన ట్యాంకర్ డ్రైవర్లతో కుమ్మక్కై, ట్యాంకర్లలోని సాల్వెంట్లు మరియు ఇతర పారిశ్రామిక రసాయనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసేవాడు. అనంతరం వాటిని తన ఆధీనంలోని వాహనాలలో ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములలో నిల్వచేసి హైదరాబాద్ మరియు ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.




అరెస్టు చేయబడిన నిందితులు

1. చాపల సత్యనారాయణ ఏ సతీష్, వయస్సు 32 సంవత్సరాలు, నివాసం వెల్లంకి గ్రామం, రామన్నపేట మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా.

2. బిపిన్ కుమార్ యాదవ్, వయస్సు 35 సంవత్సరాలు, ట్యాంకర్ డ్రైవర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం.

3. నవీన్ కుమార్, వయస్సు 31 సంవత్సరాలు, ట్యాంకర్ డ్రైవర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం.

4. రాకేష్ ప్రసాద్, వయస్సు 45 సంవత్సరాలు, కూలీ, ఖాల్సా ధాబా, చిట్యాల మండలం.

5. అమిత్ కుమార్, వయస్సు 36 సంవత్సరాలు, కూలీ, ఖాల్సా ధాబా, చిట్యాల మండలం.

స్వాధీనం చేసుకున్న వాహనాలు

బొలెరో వాహనం నెం. టూ-07-ఖచీ-1565

బొలెరో వాహనం నెం. టూ-07-ఖవీ-0626

మినీ ఐజవీ వాహనం నెం. టూ-10-ఖజ-4845

కెమికల్ ట్యాంకర్ నెం. వీఎ-42-ాూ-6795

కెమికల్ ట్యాంకర్ నెం. వీఎ-04-ౌ-8397

స్వాధీనం చేసుకున్న సామాగ్రి

పారిశ్రామిక రసాయనాలతో నింపబడిన పలు ప్లాస్టిక్ డ్రమ్ములు.

రసాయనాలను తరలించడానికి ఉపయోగించిన పైపులు మరియు ఇతర పరికరాలు.

ట్యాంకర్లకు సంబంధించిన ఇన్వాయిసులు, రవాణా పత్రాలు మరియు ఇతర సంబంధిత రికార్డులు.

నిందితులు రవాణా కోసం అప్పగించబడిన పారిశ్రామిక రసాయనాలను అక్రమంగా దారి మళ్లించి విక్రయించడం ద్వారా సంబంధిత పరిశ్రమలకు ఆర్థిక నష్టం కలిగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. ఈ అక్రమ రవాణా మరియు విక్రయాల వెనుక మరికొంత మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నదా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, నార్కెట్‌పల్లి

నల్గొండ జిల్లా

# ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను: కల్వకుంట్ల కవిత

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీతో భవిష్యత్తులో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలు వేరని, రాజకీయాలు వేరని ఆమె తేల్చి చెప్పారు. అయితే, బీఆర్ఎస్ ను అధికారంలోకి రాకుండా చేయడం తమ సిద్ధాంతం కాదని కూడా అన్నారు.పార్టీ నుంచి తనను బహిష్కరించిన తీరుపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి షోకాజు నోటీసు ఇవ్వకుండానే తనను పార్టీ నుంచి పంపించేశారని, సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని ఆమె పేర్కొన్నారు.తన నూతన పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు, కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ తరహాలోనే తాను కూడా సరికొత్త చరిత్ర సృష్టిస్తానని ధీమాగా చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని ఆమె వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఇప్పటికే 100 రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వివరించారు.



# బంగ్లాదేశ్ చేతిలో ఆసీస్ ఓడిపోవడంపై మాజీల ఫైర్

బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియాకు ఊహించని, ఘోర పరాభవం ఎదురైంది. ఆదివారం ముగిసిన తొలి టెస్టులో 9 వికెట్ల తేడాతో ఓటమిపాలవ్వడంతో, ఆసీస్ మాజీ ఆటగాళ్లు, క్రికెట్ పండితులు జట్టు ప్రదర్శనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద పరాజయాల్లో ఒకటని, ప్రపంచ నంబర్ వన్ జట్టుకు ఇది ఎంతమాత్రం "అంగీకరించలేని" ఫలితమని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.మర్రారా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 198 పరుగులకే కుప్పకూలి ఆరంభం నుంచే వెనుకబడింది. బంగ్లాదేశ్ 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించి నాలుగో రోజే చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బంగ్లా 1-0 ఆధిక్యంలో నిలవగా, ఆతిథ్య ఆస్ట్రేలియా తీవ్ర ఒత్తిడిలో పడింది.ఈ ఓటమిపై ఫాక్స్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ, మాజీ బ్యాటర్ మార్క్ వా తీవ్రంగా స్పందించాడు. "ఆస్ట్రేలియా ఆటగాళ్లు స్థాయికి తగ్గట్టు ఆడలేదు, అందుకు తగిన మూల్యం చెల్లించుకున్నారు. ఆస్ట్రేలియా గడ్డపై ఆసీస్ క్రికెట్ చరిత్రలో నేను చూసిన అతిపెద్ద పరాజయాల్లో ఇది ఒకటి కావచ్చు. ఇద్దరు ప్రధాన బౌలర్లు లేకుండా బరిలోకి దిగిన బంగ్లాదేశ్ చేతిలో పూర్తిస్థాయి బౌలింగ్ లైనప్‌తో ఉన్న ఆస్ట్రేలియా ఓడిపోవడం చాలా పెద్ద విషయం" అని వ్యాఖ్యానించాడు. జట్టు బ్యాటింగ్ వైఫల్యంపై స్పందిస్తూ, రెండో టెస్టుకు ఒకటి, రెండు మార్పులు జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని, వెదరాల్డ్‌పై తీవ్ర ఒత్తిడి ఉందని అభిప్రాయపడ్డారు.అయితే, మాజీ లెగ్ స్పిన్నర్ కెర్రీ ఓ కీఫ్ మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. మార్నస్, వెదరాల్డ్‌కు జట్టు యాజమాన్యం మరో అవకాశం ఇస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు.ఆస్ట్రేలియా మహిళా జట్టు మాజీ కెప్టెన్ అలిస్సా హీలీ ఈ ఫలితాన్ని ఓ "మేలుకొలుపు"గా అభివర్ణించింది. "గత వేసవిలో సునాయాసంగా గెలిచిన ఆసీస్, ఈ ఓటమితో కళ్లు తెరవాలి. ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగాలంటే కొన్ని అంశాల్లో మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఈ ఫలితం గుర్తుచేసింది" అని ఆమె పేర్కొంది. మరోవైపు, మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్, రెండో టెస్టులో జట్టు బలంగా పుంజుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. "ఈ ప్రదర్శనపై ఆటగాళ్లు తీవ్ర నిరాశతో, తమపై తామే అసహ్యంతో ఉంటారు. అదే వారిని పుంజుకునేలా చేస్తుంది" అని వ్యాఖ్యానించాడు.మాజీ ఫాస్ట్ బౌలర్ ట్రెంట్ కోప్‌లాండ్ సెన్ రేడియోలో మాట్లాడుతూ, ఈ ఓటమిని "పూర్తిగా ఆమోదయోగ్యం కానిది"గా పేర్కొన్నాడు. "సొంత గడ్డపై, ప్రపంచ నంబర్ వన్ టెస్ట్ జట్టుగా ఉండి బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోవడం సిగ్గుచేటు. ఇది ఇబ్బందికరమైన ఓటమి. ఈ విషయం మైదానంలోకి దిగిన 11 మంది ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందికి అందరికంటే బాగా తెలుసు" అని అన్నాడు. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆగస్టు 22 నుంచి మాకేలోని గ్రేట్ బ్యారియర్ రీఫ్ ఎరీనాలో ప్రారంభం కానుంది.



# ట్రంప్‌ను 'ఫుడ్ ట్రక్'తో పోల్చిన ఇరాన్.. హార్మ్యూజ్ జలసంధిపై మాటల యుద్ధం

చేయడమే కాకుండా, ముందు ఆయన తన సొంత భద్రత గురించి ఆలోచించుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచింది.ట్రంప్ విదేశాంగ విధానాలు, హెచ్చరికలు స్థిరంగా ఉండవని, రోడ్డు పక్కన ఉండే ఫుడ్ ట్రక్కులు తమ మెనూను, ప్రదేశాన్ని మార్చినట్లుగానే ఆయన తీరు కూడా ఉంటుందని ఇరాన్ దౌత్య వర్గాలు విమర్శించాయి. స్థిరమైన దౌత్యనీతి లేని నాయకుడిగా అభివర్ణించేందుకే ఈ 'ఫుడ్ ట్రక్' పదాన్ని ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. అంతేకాకుండా, అమెరికాలో ట్రంప్ ఎదుర్కొంటున్న రాజకీయ, న్యాయపరమైన సవాళ్లను ప్రస్తావిస్తూ, ఇరాన్‌కు సలహాలిచ్చే ముందు తన భద్రత గురించి చూసుకోవాలని టెహ్రాన్ హితవు పలికింది.పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలిపే హార్మ్యూజ్ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి అత్యంత



వ్యూహాత్మకమైనది. ప్రపంచ సముద్ర చమురు రవాణాలో 20 శాతానికి పైగా, అంటే రోజుకు సుమారు 21 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. తమపై పాశ్చాత్య దేశాలు విధించే ఆంక్షలకు ప్రతిగా ఈ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ తరచూ హెచ్చరిస్తుండగా, అక్కడ నౌకల స్వేచ్ఛా రవాణాకు ఆటంకం కలిగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా స్పష్టం చేస్తూ వస్తోంది.

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

# సినిమా విజయం అంటే లెక్కలు కాదు: సూర్య


ఒక సినిమా విజయాన్ని కేవలం మొదటి వారాంతపు వసూళ్లు, అమ్ముడైన టికెట్ల



సంఖ్యతోనే అంచనా వేయడం సరికాదని ప్రముఖ నటుడు సూర్య అభిప్రాయపడ్డాడు. తన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' సక్సెస్ మీట్‌లో పాల్గొన్న ఆయన, సినిమా విజయానికి ఉండాల్సిన అసలైన నిర్వచనాన్ని వివరించాడు.ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని కేవలం అంకెలతోనే కొలుస్తున్నారని, అయితే అది సంపూర్ణమైన కొలమానం కాదని సూర్య పేర్కొన్నాడు. "ఒక సినిమా ప్రేక్షకుల హృదయాల్లో ఎంత లోతుగా నిలిచిపోయింది అనేదే ముఖ్యం. సినిమా వీక్షించిన తర్వాత ప్రేక్షకులు పొందే భావోద్వేగాలు, ఆ చిత్రంపై వారు జరిపే చర్చలే అసలైన విజయం" అని అన్నాడు. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా సినిమా తాలూకు ప్రభావం ప్రేక్షకుడితోనే కొనసాగాలని ఆయన ఆకాంక్షించాడు."ఒక సినిమా విడుదలైన రెండేళ్ల తర్వాత కూడా ప్రజలు దాని గురించి మాట్లాడుకుంటున్నారంటే, ఆ కథకు, చిత్ర బృందం పడిన శ్రమకు దక్కిన నిజమైన గౌరవం అదే" అని సూర్య వివరించాడు. అదే సమయంలో, సినిమా వ్యాపార కోణాన్ని కూడా సూర్య ప్రస్తావించాడు. నిర్మాతలు, పంపిణీదారులు ఆర్థికంగా సురక్షితంగా ఉండాలంటే బాక్సాఫీస్ వసూళ్లు కూడా కీలకమేనని స్పష్టం చేశాడు. ప్రేక్షకుల ఆదరణ, వాణిజ్యపరమైన వసూళ్లు రెండూ సమపాళ్లలో లభించినప్పుడే ఏ సినిమా అయినా సంపూర్ణ విజయాన్ని అందుకున్నట్లు అవుతుందని పేర్కొన్నాడు.

# రవితేజ 'ఇరుముడి' నుంచి 'మల్లెపూల పల్లకి' సాంగ్ వచ్చేసింది!

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మొదటి పాట విడుదలైంది. 'మల్లెపూల పల్లకి' అంటూ సాగే ఈ పాట లిరికల్ వీడియోను చిత్ర బృందం ఆదివారం విడుదల చేసింది. హైదరాబాదులో ఆదివారం ఏర్పాటు చేసిన గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఈ సాంగ్ ను ఆవిష్కరించారు. విడుదలైన కొద్దిసేపటికే ఈ పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ 'మల్లెపూల పల్లకి' పాటకు చౌడం శ్రీనివాసరావు సాహిత్యం అందించారు. గాయకుడు డప్పు శ్రీను తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. రవితేజ ఎనర్జీకి తగినట్టుగా జీవీ ప్రకాశ్ అందించిన సంగీతం, క్యాచీ ట్యూన్ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ప్రేమకథా చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ, మాస్ ఇమేజ్ ఉన్న రవితేజ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై సినీ వర్గాల్లో మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటించారు. బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషించింది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ-సిరీస్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం విశేషం. ఏకేడీ స్టూడియోస్, యూవీ సంస్థలు కూడా నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 'ఇరుముడి' చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విడుదలైన తొలి పాట సినిమా ప్రమోషన్లకు మంచి ఊపునిచ్చింది.



# ఎల్‌నినో ప్రభావం.. వరి సాగుకు స్వస్తి పలకాలి





**నాగార్జునసాగర్‌పై ఆధారపడి కొత్తగా వరి నాట్లు వేయొద్దు**
**పప్పు, నూనెగింజలు, చిరుధాన్యాల వైపు రైతులు మళ్లాలి**
**వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ. ఆల్దాస్ జానయ్య సూచన**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు కొనసాగుతున్న నేపథ్యంలో వరి సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించి పప్పు దినుసులు, నూనెగింజలు, చిరుధాన్యాలు వంటి మెట్ట పంటల వైపు రైతులు మళ్లాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దస్ జానయ్య. సూచించారు. ఆదివారం నాడు నల్లగొండలో వ్యవసాయ రంగంపై ఎల్ ని నో ప్రభావం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలపై రైతు సంఘం సెమినార్ నిర్వహించడం జరిగింది. సెమినార్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అల్దాస్ జానయ్య మాట్లాడుతూ నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టుల్లో నీటి లభ్యతపై ఆశలు పెట్టుకుని కొత్తగా వరి నాట్లు వేయడం సరికాదని స్పష్టం చేశారు. ఇప్పటికే నార్లు పోసిన రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు.నల్లగొండ పట్టణంలోని డైనింగ్ హాల్‌లో ఆదివారం వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన సెమినార్‌లో వీసీ మాట్లాడారు. రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే ప్రస్తుతం సుమారు 10--12 శాతం వర్షపాతం లోటు నమోదైందని, ఎనిమిది జిల్లాల్లో లోటు మైనస్ 30 శాతం వరకు చేరిందని తెలిపారు.

ఎల్‌నినో కొత్తేమీ కాదు

గత 30 ఏళ్లలో సుమారు ఆరు ఎల్‌నినో సంవత్సరాలను ఎదుర్కొన్నామని, ఇది కొత్త పరిణామం కాదని వీసీ తెలిపారు. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో సంభవించే నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టడం శు భపరిణామమన్నారు.వర్షాలు తగ్గాయని రైతులు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ఒక అవకాశంగా మలుచుకుని పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.

వరి విస్తీర్ణం తగ్గించాల్సిందే

రాష్ట్రంలో అవసరానికి మించి వరి ఉత్పత్తి జరుగుతోందని, వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని వీసీ పేర్కొన్నారు. అదే సమయంలో బోర్ల సంఖ్య పెరగడంతో భూగర్భ జలాల వినియోగం కూడా అధికమైందన్నారు. ఈ ఏడాది వర్షాలు తగ్గడంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గిపోయాయని, భవిష్యత్తులో భూగర్భ జలాలు కూడా మరింత తగ్గే అవకాశం ఉందన్నారు.వరి సాగుకు అధికంగా నీరు, రసాయన ఎరువులు అవసరమవుతాయని, వరి విస్తీర్ణాన్ని తగ్గించడం ద్వారా నీటి వనరులను కాపాడుకోవచ్చన్నారు. నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసే రైతు కనీసం రెండు ఎకరాల్లో పప్పు దినుసులు, నూనెగింజలు లేదా ఇతర మెట్ట పంటలు సాగు చేయాలని సూచించారు. సాగర్ నీళ్లపై ఆశలు వద్దు నాగార్జునసాగర్‌లో ఈసారి నీరు నిండే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని గత రెండు నెలలుగా ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, నీటిపారుదల శాఖ రైతులను అప్రమత్తం చేస్తున్నాయని వీసీ తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచడంతో పాటు విత్తన మేళాలు కూడా నిర్వహించినట్లు చెప్పారు.అయినప్పటికీ సాగర్ నీళ్లు వస్తాయన్న ఆశతో కొంతమంది రైతులు వరి నార్లు పోసుకున్నారని తెలిపారు. బావులు, బోర్లు ఉన్న ప్రాంతాల్లో కొంతమేర పంటను కాపాడుకునే అవకాశం ఉన్నప్పటికీ కేవలం సాగర్ నీటిపైనే ఆధారపడిన వరి సాగుకు ప్రస్తుతం అనుకూల పరిస్థితులు లేవన్నారు. కొత్తగా నాట్లు వేయొద్దు ఇప్పటి నుంచి కొత్తగా వరి నాట్లు వేయొద్దని వీసీ స్పష్టం చేశారు. ఇప్పటికే నారు పోసుకున్న రైతులు పరిస్థితిని గమనించాలని, కేవలం సాగర్ నీటిపై ఆధారపడి నాట్లు వేసుకోవడం వల్ల తర్వాత నీటి కొరతతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రకారం సెప్టెంబర్ వరకు ఇదే తరహా పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. హిందూ మహాసముద్రంలో ఐఓడీ ) సానుకూలంగా మారితే ఎల్‌నినో ప్రభావం కొంత తగ్గి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే అలాంటి వర్షాలు వచ్చినా ప్రస్తుత వానాకాలం వరి పంటకు కాకుండా రెండో పంట లేదా ముందస్తు యాసంగికి మాత్రమే ఉపయోగపడే అవకాశం ఉందన్నారు.

ప్రకృతిని ఎదుర్కోలేం.. ప్రత్యామ్నాయమే మార్గం

సాగర్ నుంచి నీరు రాకపోవడం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తున్నది కాదని, ప్రస్తుత పరిస్థితులు ప్రకృతి ఆధారితమైనవని వీసీ పేర్కొన్నారు. ప్రకృతి అనుకూలించని సమయంలో పరిస్థితులను అర్థం చేసుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు.పప్పు దినుసులు, నూనెగింజలు, చిరుధాన్యాలు వంటి పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులు కొంత ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎల్‌నినోను కేవలం సంక్షోభంగా కాకుండా పంటల వైవిధ్యాన్ని పెంచుకునే అవకాశంగా చూడాలని రైతులకు పిలుపునిచ్చారు.వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, రైతు సంఘాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయంతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

ఎల్నినో ప్రభావంతో పంటల మార్పిడి తప్పనిసరి

రైతులను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని, ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని అఖిలభారత కిసాన్‌సభ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సూచించారు ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను అంచనా వేసుకుని తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నల్లగొండలోనే రైతు మహాసభకు ప్రత్యేకత అఖిల భారత కిసాన్‌సభ 36వ మహాసభను నల్లగొండలో నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయమని జూలకంటి రంగారెడ్డి అన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నల్లగొండ కేంద్రంగా నిలిచిందని, వేలాది మంది రైతులు ప్రాణత్యాగాలు చేసిన చారిత్రక ప్రాంతమని గుర్తుచేశారు. ఆ పోరాట ఫలితంగా భూ పంపిణీ, వెట్టిచాకిరీ రద్దు వంటి కీలక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది రైతు ప్రతినిధులు నాలుగు రోజులపాటు మహాసభలో పాల్గొంటారని తెలిపారు.

లక్ష మంది రైతులతో ర్యాలీ

మహాసభను కేవలం ప్రతినిధులతో నిర్వహించి తీర్మానాలు చేయడం కాకుండా, రైతాంగాన్ని పెద్దఎత్తున కదిలించే కార్యక్రమంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటికో వ్యక్తి, గ్రామానికో బస్సు లేదా రెండు ట్రాక్టర్లు కదిలేలా రైతులను సమీకరించాలని పిలుపునిచ్చారు. రాబోయే మూడు నెలల్లో రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా గ్రామాల్లో పర్యటించాలని కోరారు. రైతుల సహకారంతోనే మహాసభను నిర్వహించాలన్నదే తమ నిర్ణయమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 1.30 లక్షల రైతు కుటుంబాలను నేరుగా కలవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల కుటుంబాలను సంప్రదించనున్నట్లు వెల్లడించారు. మహాసభకు అవసరమైన బియ్యం, కూరగాయలు, పప్పులు తదితర సరుకులతో పాటు ఆర్థిక సహకారాన్ని రైతులు అందించాలని కోరారు.

గిట్టుబాటు ధరకు చట్టం రావాలి రైతులు రికార్డు స్థాయిలో పంటలు పండిస్తున్నప్పటికీ గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారని జూలకంటి ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు ధర నిర్ణయించే అధికారం రైతుకు లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, ఎరువుల కొరత, బ్యాంకు రుణాల సమస్యలు రైతులను తీవ్రంగా వేధిస్తున్నాయని తెలిపారు. రైతుల సమస్యలపై అఖిల భారత కిసాన్‌సభ మహాసభలో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది రైతులు సంక్షేమంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జూలకంటి రంగారెడ్డి అన్నారు. వ్యవసాయ రంగం దెబ్బతింటే దాని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైతుల సమస్యలపై పోరాటాలు కొనసాగుతున్నాయని, రైతాంగాన్ని ఐక్యంగా కదిలించి హక్కుల సాధనకు ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నల్లగొండలో తొలిసారిగా నిర్వహిస్తున్న అఖిల భారత రైతు మహాసభను విజయవంతం చేసేందుకు రైతులు, ప్రజా ఉద్యమాల నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలుగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సెమినార్ లో విశ్రాంత ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వీరపల్లి వెంకటేశ్వర్లు, కందాల ప్రమీల, బండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వీరపల్లి వెంకటేశ్వర్లు
జిల్లా ప్రధాన కార్యదర్శి

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528